క్లుప్తంగా

ఎర్రబురుజులో తీవ్ర నీటి సమస్య



వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని 11వ వార్డు ఎర్రబురుజు ప్రాంతంలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. రెండు రోజులుగా కాలనీకి నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న సీపీఎం నాయకులు ఎస్ఎండీ షరీఫ్ ఆధ్వర్యంలో నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ పాత బస్టాండ్ సమీపంలోని వాటర్ వర్కర్స్ కార్యాలయ అధికారులతో మాట్లాడారు. నీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. ఇక్కడ ఉండే ప్రజలంతా కూలీ పనులు, ఆటో కార్మికులు కావడంతో వారికి అనువైన సమయాల్లో నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉల్చాలలో ఏరువాక సంబరాలు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మండలం ఉల్చాలలో ఏరువాక సంబరాలు ఘనంగా జరిగాయి. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా డప్పు దరువులతో పెద్ద ఎత్తున చిందులు వేస్తూ ర్యాలీ నిర్వహించారు. కులాలు, మతాలకు అతీతంగా ఏరువాక వేడుకల్లో పాల్గొని పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా జి.రామకృష్ణ మాట్లాడుతూ.. అన్నదాతలను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. ప్రతి ఏటా రూ.20 వేలు ఇస్తానని చెప్పి మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో తాండ్రపాడు గ్రామ సర్పంచ్ బాలపీర, హుస్సేనయ్య తదితరులు పాల్గొన్నారు.

23న ఒలింపిక్ డే రన్



ఒలింపిక్ డే పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శమంతకమణి తదితరులు

కర్నూలు (టౌన్): ఈనెల 23న ఒలింపిక్ డే రన్‌ను విజయవంతం చేయాలని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శమంతకమణి పిలుపునిచ్చారు. స్థానికంగా ఓ ప్రైవేటు సమావేశ హాలులో బుధవారం ఒలింపిక్ డే రన్ ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒలింపిక్ డేను పురస్కరించుకొని ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు జిల్లాస్థాయి అంతర్ పాఠశాలల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర మాట్లాడుతూ.. క్రీడాకారుల సంక్షేమం కోసం తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం సీఈఓ విజయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, కార్యనిర్వాహక కార్యదర్శి సునీల్‌కుమార్, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

13న ఉచిత వైద్యశిబిరం

కర్నూలు (సెంట్రల్): అమీలియో హాస్పిటల్ వారి సహకారంతో ఈనెల 13వ తేదీన జర్నలిస్టుల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు మీసాల రామస్వామి కోరారు. ఉచిత వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్లను బుధవారం ఇన్‌చార్జ్ డీఆర్వోతో ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఉచిత శిబిరంలో 2డీ ఎకో, ఈసీజీ, ఆర్‌బీఎస్, బీపీ, కంటి పరీక్షలు ఉచితంగా చేసి మందులను కూడా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కలెక్టరేట్‌లోని పొదుపు భవన్‌లో జరిగే ఉచిత శిబిరానికి జర్నలిస్టులు తమ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది కాలంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కింద రూ.6 వేల కోట్లను చెల్లించాల్సి ఉన్నా పట్టించుకోకపోవడంతో ఎంతో మంది పేద విద్యార్థులు పరీక్షలకు దూరమవుతున్నారని చెప్పారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతామని స్పష్టంచేశారు.

● కన్నయ్యకు కదళీ ఫలోత్సవం



సందేశమిస్తున్న రఘునందన సేవక ప్రభు



కన్నయ్యకు అరటి పండ్ల నివేదన

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని స్వామి మందిరంలో బుధవారం కదళీ ఫలోత్సవం జరిగింది. జ్యేష్ఠ పూర్ణిమ జగన్నాథ్ స్వామి జన్మదినం పురస్కరించుకొని భక్తులు తెచ్చిన అరటి పండ్లను నైవేద్యంగా నివేదించారు. ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు సందేశమిచ్చారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు స్వామివారిని దర్శించుకొని రాజ భోగ ప్రసాదాన్ని స్వీకరించారు.

రోగుల వివరాలు నమోదు చేయాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ మహేశ్వరప్రసాద్

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రికి చికిత్స కోసం ఓపీకి వచ్చిన రోగుల వివరాలను తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ (ఈహెచ్ఆర్)లో నమోదు చేయాలని ఆర్‌బీఎస్‌కే/ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఎస్.మహేశ్వరప్రసాద్ సూచించారు. బుధవారం కర్నూలు నగరంలోని ఇందిరమ్మ హౌసెస్ యూపీహెచ్‌సీలో అన్ని ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాతాశిశు ఆరోగ్య కార్యకలాపాలు సక్రమంగా అమలు చేయాలన్నారు. క్షయ వ్యాధి ముక్త్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎన్‌సీడీ అనుమానితుల నిర్ధారణను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. ఎన్‌సీడీ ఫాలో అప్స్ వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. ఆర్‌బీఎస్‌కే రిఫరల్స్‌ను క్లియర్ చేయాలన్నారు. అనంతరం ఫ్లోరోసిస్ గురించి డాక్టర్ సుధాకర్ వివరించారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రోషిణి, ఆర్‌కేఎస్‌కే కన్సల్టెంట్ ఎం.మల్లికార్జున పాల్గొన్నారు.

జర్నలిస్టుల డిమాండ్లను పరిష్కరించాలి



ఇన్‌చార్జ్ డీఆర్వో బీకే వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): జర్నలిస్టుల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ నాగేంద్ర, నగర అధ్యక్షుడు ఎం.శివశంకర్ కోరారు. బుధవారం జర్నలిస్టుల డిమాండ్ డే పురస్కరించుకొని పలు డిమాండ్లను పరిష్కరించాలని ఇన్‌చార్జ్ డీఆర్వో బీకే వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిమాండ్ డే సందర్భంగా జిల్లాలోని అన్ని మండలాలు, డివిజన్ కేంద్రాల్లో తమ డిమాండ్ల పరిష్కారాల కోసం ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించినట్లు చెప్పారు. గౌరవ వేతనంతో బతుకు జీవనం సాగిస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నారు. అర్హులైన వారందరికీ అక్రిడిటేషన్లను ఇవ్వాలని, జర్నలిస్టుల రక్షణ చట్టం తేవాలని కోరారు. సీనియర్ నాయకులు సునీల్‌కుమార్, నగర ప్రధాన కార్యదర్శి ఎర్రమల, నాయకులు జమ్మన్న, బీమేష్ పాల్గొన్నారు.

రాయలసీమ ప్రాజెక్టులను పూర్తి చేయాలి

- కమీషన్ల కోసమే తెరపైకి పోలవరం – బనకచర్ల ప్రాజెక్టు
- 90 శాతం సబ్సిడీతో రైతులకు విత్తనాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న జి.ఈశ్వరయ్య, కె.జగన్నాథం

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం జేబులు నింపుకొనేందుకే పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును తెరపైకి తెస్తోందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కె.జగన్నాథం విమర్శించారు. బుధవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టుకు ఏకంగా రూ.80 వేల కోట్ల బడ్జెట్‌తో అంచనాలు రూపొందించడం అన్యాయమన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల సీమకు ఏ మాత్రం మేలు జరగదన్నారు. నిజంగా చంద్రబాబునాయుడుకు రాయలసీమపై చిత్తశుద్ధి ఉంటే ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఏడాదిగా రైతులకు ఏమీ చేయని బాబు.. ఒక్కసారిగా తన ఏటీఎం కోసం బనకచెర్లను ముందుకు తెచ్చారన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా పెట్టుబడి సాయం కింద ఇస్తామన్న రూ.20 వేలు ఎప్పుడు ఇస్తారో చెప్పడం లేదని విమర్శించారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని కోరారు. నాయకులు మునెప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైద్యులు సమయపాలన పాటించాలి



ఓపీ విభాగాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, అలాగే వైద్యులు సమయపాలన పాటించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు. ఆయన బుధవారం ఆసుపత్రిలోని పలు ఓపీ విభాగాలను ఆకస్మిక తనిఖీ చేశారు. జనరల్ మెడిసిన్, డెంటల్, ఈఎన్‌టీ, జనరల్ సర్జరీ, ఎమర్జెన్సీ విభాగాలను పరిశీలించి రోగుల వివరాలు, మాడ్యూల్ డేటా ఎంట్రీ, వైద్యుల సమయపాలనపై ఆరా తీశారు. ఓపీకి వచ్చే రోగుల రిజిస్టర్‌ను పరిశీలించి ఈ-హాస్పిటల్‌లో రోగుల ఈ-మాడ్యూల్ ఎంట్రీ అయ్యేలా చూసుకోవాలన్నారు. అత్యవసర విభాగంలో ఈ-హాస్పిటల్ మాడ్యుల్‌లో ఓపీ, ఐపీ ఎంట్రీ అయ్యేలా చూసుకోవాలని చెప్పారు. సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, జనరల్ మెడిసిన్ హెచ్ఓడీ డాక్టర్ రాజశేఖర్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

టీకాలపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న డెమో శ్రీనివాసులు శెట్టి

కర్నూలు(హాస్పిటల్): ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పించే వ్యాధి నిరోధక టీకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి చెప్పారు. ఆయన బుధవారం స్థానిక ముజఫర్‌నగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని 81వ సచివాలయంలో నిర్వహిస్తున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, పిల్లలు వ్యాధుల బారిన పడకుండా టీకాలు రక్షణ కల్పిస్తాయన్నారు. తల్లులు తమ పిల్లలకు సమయానుసారంగా వ్యాధినిరోధక టీకాలు వంద శాతం ఇప్పించాలని సూచించారు. 2026 నాటికి మీజిల్స్ రుబెల్లా వ్యాధిని నిర్మూలించే లక్ష్యంగా ఎంఆర్ ఎలిమినేషన్ కార్యక్రమంలో భాగంగా ఎంఆర్ వ్యాక్సిన్‌ను బిడ్డకు 9, 16 నెలల వయస్సులో తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, టీబీ సూపర్‌వైజర్ నిక్షిత్, వైద్య సిబ్బంది పుష్పలత, మహేశ్వరి, స్వర్ణలత పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలో విద్యుత్ శాఖకు సంబంధించి వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నందున ఈ నెల 12న పలు ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. అధికారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థలో పనిచేసే నాన్ పబ్లిక్ హెల్త్ వర్కర్ల వేతనాల పెంపుపై సమ్మెలోకి వెళ్లడంతో నగరంలో తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీటి సరఫరా విభాగం సిబ్బంది ఈ నెల 10వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లారని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయంగా సిబ్బందిని నియమించామని తెలిపారు. పైప్‌లైన్ జంక్షన్ వద్ద వాల్వ్ తిప్పితే ఏయే ప్రాంతానికి నీళ్లు వెళుతాయన్న విషయం ప్రత్యామ్నాయంగా నియమించిన సిబ్బందికి తెలియక కొంత ఇబ్బంది వచ్చినట్లు వివరించారు. మెరుగ్గా తాగునీటిని సరఫరా చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, నగర ప్రజలు సహకరించాలని కోరారు.

జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటాలి

కర్నూలు (టౌన్): రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో ఈనెల 13 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి సీనియర్ ఉషూ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చాటాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ సూచించారు. ఆయన బుధవారం జాతీయ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు క్రిష్ణవేణి, మహేశ్వరి, శ్రావణి, చంద్రమౌళి, క్రాంతికుమార్, సురేష్‌ను అభినందించారు. టీజీ మాట్లాడుతూ.. జాతీయ పోటీలను అవకాశంగా మలుచుకొని పతకాలతో తిరిగి రావాలన్నారు. ఉషూ సంఘం కార్యదర్శి టీ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఏపీ పీజీసెట్‌కు 93 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: ఏపీ పీజీసెట్-2025లో భాగంగా బుధవారం జరిగిన పరీక్షలకు 83.71 శాతం హాజరు నమోదైంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, దూపాడు సమీపంలోని ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రంలో పరీక్షలు జరిగాయి. హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్స్, కామర్స్, జువాలజీ, కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్, లైఫ్‌సైన్స్ పరీక్షలు జరిగాయి. మొత్తం 571 మంది విద్యార్థులకు 478 మంది హాజరు కాగా 93 మంది గైర్హాజరయ్యారు. అబ్జర్వర్లు ప్రభుత్వ అధ్యాపకులు డాక్టర్ మధుసూదన్, డాక్టర్ రామలింగారెడ్డి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. గురువారం సెషన్-1లో సైకాలజీ, జియోగ్రఫీ పరీక్షలు జరగనున్నాయి.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం

కర్నూలు(సెంట్రల్): కూటమి సర్కార్‌కు ఏడాది హనీమూన్ సమయం ముగిసిపోయిందని, ఇక వరుసగా ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాలకు దిగుతామని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. బుధవారం ఆమె కర్నూలు జిల్లాలో పర్యటించారు. నగరంలోని కళా వెంకట్రావు భవన్‌లో కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. అంతకముందు షర్మిల మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీలు ఇచ్చి సూపర్‌ఫ్లాప్ అయిందన్నారు. ఎన్నికల ముందు హామీల వరద పారించి ఇప్పుడు ఒక్కటీ అమలు చేయకుండా సర్కారు కాలయాపన చేస్తోందన్నారు. ప్రశ్నిస్తానన్న పవన్ కల్యాణ్ కాషాయం కప్పుకొని బీజేపీ మోచేతి నీళ్లు తాగుతున్నాడని విమర్శించారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తామని చెప్పడంతో లక్షలాదిమంది తల్లులు ఎదురుచూస్తున్నారన్నారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు షేక్ జిలానీబాషా, నంద్యాల జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రోద్బలంతోనే 'సాక్షి'పై దాడులు

- రాజకీయ కక్షతోనే వైఎస్ భారతిపై నిందారోపణలు
- సజ్జలపై తప్పుడు కేసులు పెట్టి ఇరికించేందుకు కుట్ర
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్



మాట్లాడుతున్న మద్దూరు సుభాష్ చంద్రబోస్

కర్నూలు (టౌన్): కూటమి ప్రభుత్వ ప్రోద్బలంతోనే రాష్ట్రవ్యాప్తంగా 'సాక్షి' కార్యాలయాలపై దాడులు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ ఆరోపించారు. బుధవారం స్థానిక సీ.క్యాంపులోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అధికార మదంతో 'సాక్షి' కార్యాలయాలపై దాడులకు ఉసిగొల్పుతున్న కూటమి పార్టీల నాయకులు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో మహిళలకు అధిక ప్రాధాన్యత కల్పించారని గుర్తు చేశారు. రాజకీయ కక్షతోనే వైఎస్ భారతిపై నిందలు వేస్తూ అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ ఆవిర్భావం నుంచి జగనన్న వెంట ఉండి నిరంతరం పార్టీ కోసం పని చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిపై తప్పుడు కేసులు పెట్టి ఇరికించేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడం సిగ్గుచేటన్నారు. అకస్మాత్తుగా ఒక వ్యక్తి లైవ్ ప్రోగ్రాంలో చేసిన దురదృష్టకర వ్యాఖ్యలపై ఆయనకు సంబంధం లేకున్నా క్షమాపణలు చెప్పారని, అయినా దురుద్దేశంతో కూటమి నాయకులు మరింత విషప్రచారం చేస్తూ మహిళలను అవమానిస్తున్నారన్నారు. అక్రమ కేసులతో చట్టాలను దుర్వినియోగం చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు క్షమించరని ఆయన హెచ్చరించారు.

ఆప్కాస్ డిమాండ్లు పరిష్కరించాలి



మున్సిపల్ కార్మికుల సమ్మెకు సంఘీభావం ప్రకటించిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

కర్నూలు (టౌన్): ఆప్కాస్ (ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఔట్ సోర్సింగ్ సర్వీస్) కార్మికులు చేస్తున్న సమ్మె న్యాయబద్ధమైందని, వెంటనే కూటమి ప్రభుత్వం స్పందించి వారి డిమాండ్లను పరిష్కరించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ షేక్ అహమ్మద్, జుబేర్ డిమాండ్ చేశారు. నెలరోజులకు పైగా మున్సిపల్ ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్, వీధిలైట్ల కార్మికులు విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్నా.. ఈ ప్రభుత్వానికి చలనం లేదని విమర్శించారు. బుధవారం స్థానిక నగరపాలక సంస్థ ఎదుట సమ్మె చేస్తున్న కార్మికులకు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు లక్ష్మీకాంత రెడ్డి, షేక్ యూనుస్‌బాషా, పార్టీ నాయకులు సంఘీబావం ప్రకటించారు. వారు మాట్లాడుతూ.. ఆప్కాస్ కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. కార్మికులు సమ్మె బాట పట్టడంతో నగరంలో మంచినీటి సమస్య తలెత్తిందన్నారు. సమస్య పరిష్కారానికి ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కనీస వేతనం అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎండీ అంజిబాబు

కర్నూలు(సెంట్రల్): సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో సెక్యూరిటీ గార్డులు దుర్భరమైన జీవనం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజులు నిద్రాహారాలు మాని పనిచేస్తే సమయానికి జీతాలు చెల్లించడం లేదన్నారు. ప్రతి నెలా మొదటి వారంలోనే జీతాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాక పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఉద్యోగ భద్రతకు హామీ ఇవ్వాలని కోరారు. నాయకులు చాంద్, రాధాకృష్ణ, కుమార్, లింగన్న, బాలు, సునీత, మద్దిలేటి పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కోటాను సద్వినియోగం చేసుకోండి



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సెల్ అధ్యక్షుడు జి.సురేంద్ర

కర్నూలు (టౌన్): క్రీడాకారులు 3 శాతం స్పోర్ట్స్ కోటాను వినియోగించుకోవాలని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సెల్ అధ్యక్షుడు జి.సురేంద్ర సూచించారు. బుధవారం స్థానిక బి.క్యాంపులోని క్రీడా మైదానంలో జిల్లాస్థాయి స్త్రీ, పురుషుల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ప్రారంభించారు. పోటీలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడా రంగంలో ప్రతిభ చాటే వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా, ఉద్యోగ రంగాల్లో 3 శాతం రిజర్వేషన్లు కల్పించాయని, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 జిల్లా కార్యదర్శి హర్షవర్ధన్ మాట్లాడుతూ.. ఎంపిక పోటీల్లో రాణించిన క్రీడాకారులు ఈ నెల 14, 15 తేదీల్లో గుంటూరులోని ఆచార్య నాగర్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

భక్తిశ్రద్ధలతో జ్యేష్టాభిషేకం



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి

కర్నూలు కల్చరల్: కర్నూలు శ్రీవిష్ణు సహస్ర నామ సత్సంగం ఆధ్వర్యంలో భరతమాత దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో జ్యేష్టాభిషేక మహోత్సవం నిర్వహించారు. శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి వారికి 108 కలశాలతో ఘనంగా అభిషేకం నిర్వహించారు. వేద పండితులైన మధుసూదనాచార్యుల పర్యవేక్షణలో వేడుక జరిగింది. భరతమాత ఆలయ కమిటీ అధ్యక్షుడు సందడి మహేశ్వర్, కార్యాధ్యక్షులు రామసుబ్బారెడ్డి, కోశాధికారి మల్లెల పెద్ద పుల్లారెడ్డి, ఆలయ కమిటీ కార్య నిర్వాహక సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారిగా వాజిద్

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారిగా వాజిద్‌ను నియమించారు. ఈ మేరకు బుధవారం నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన రెవెన్యూ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటికే రెవెన్యూ అధికారులుగా జునీద్, ఇశ్రాయేలు ఉన్నారు. అయితే నగర విస్తీర్ణం పెరగడంతో పాటు పలు కాలనీలు విలీనం చేయడంతో వార్డుల సంఖ్య పెరిగింది. అయినా ఒకరి ద్దరితో రెవెన్యూ పాలనను కొనసాగించారు. శివారు కాలనీలు పెరగడం ఇళ్ల అసెస్‌మెంట్ల సంఖ్య 1.39 లక్షలు దాటడంతో అన్ని వ్యవహారాలు చూసుకోవడం ఇబ్బందిగా మారింది. దీంతో అదనంగా మరో రెవెన్యూ అధికారిని నియమించారు. పాలన సౌలభ్యం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు. వాజిద్‌కు రెవెన్యూ విభాగంలో సుదీర్ఘ అనుభవం ఉంది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. పని విభజన చేసిన కమిషనర్ ఆయనకు పాణ్యం పరిధిలోని 19, 20, 21 వార్డులు, 28, 34 వార్డులు, 86వ పేట, 87వ పేట అలాగే 103 నుంచి 127 వరకు పేటలను కేటాయించారు.

భక్తిశ్రద్ధలతో ఏరువాక పున్నమి



గోవు, వృషభ పూజలు చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: జిల్లా గోరక్షణ శాలలో గాయత్రీ గో సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం జ్యేష్ఠమాసం ఏరువాక పున్నమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోమాత, గాడిపాటి పూజ, వృషభ గోపూజ కార్యక్రమాలను విశేషంగా నిర్వహించారు. రైతులందరూ తమ వ్యవసాయ పనులు ప్రారంభించే శుభ సందర్భంలో పాడిపంటలు కలగాలని గోమాతలను వేడుకుంటూ పూజలు చేసినట్లు గో సేవా సమితి ప్రతినిధులు అన్నారు. గోవులకు ఆహారం అందించి గో సేవకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు. సమితి ప్రతినిధులు రాజ్యలక్ష్మి, విజయకుమార్, గోశాల సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ కేంద్రం వద్ద టీచర్ల ఆందోళన



కౌన్సెలింగ్ కేంద్రం ఎదుట ఆందోళనకు దిగిన భాషా పండితులు

కర్నూలు (సిటీ): ఉపాధ్యాయుల బదిలీల్లో పాఠశాల విద్యాశాఖ తీసుకుంటున్న నిర్ణయాలపై ఉపాధ్యాయ వర్గాల్లో రోజురోజుకు ఆందోళన పెరుగుతోంది. గత రెండు రోజులుగా సెకండరీ గ్రేడ్ టీచర్లకు బదిలీల ప్రక్రియ రాత్రి, పగలు అనే తేడా లేకుండా నిర్వహిస్తున్నారు. మాన్యువల్ కౌన్సెలింగ్ కావడంతో స్లాట్‌ల ప్రకారం బదిలీల ఆప్షన్‌ను ఎంపిక చేసుకునేందుకు విద్యాశాఖ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించింది. మొదటి రోజున సీనియారిటీ జాబితాలో 1 నుంచి 500 నంబర్ వరకు ఉన్న టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ మంగళవారం రాత్రి మొదలై బుధవారం ఉదయం 10 గంటల వరకు జరిగింది. బుధవారం ఉర్దూ టీచర్లకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ప్రాధాన్యత కేటగిరీ టీచర్ల బదిలీలో మెడికల్ బోర్డు ఇచ్చిన సర్టిఫికెట్లు అనుమతించే విషయంలో తరచుగా అభ్యంతరాలు వ్యక్తం కావడంతో వాయిదాల మీద వాయిదాలు పడుతూ అర్ధరాత్రి వరకు కొనసాగింది. సీనియారిటీ జాబితాలో 501 నంబర్ నుంచి ఉన్న టీచర్ల మాన్యువల్ కౌన్సెలింగ్ ఆలస్యంగా మొదలైంది. రాత్రివేళలో డీఈఓ పూల్‌లో ఉన్న 95 మంది తెలుగు పండిట్లకు రెగ్యులర్ స్థానాలు కేటాయించి బదిలీలు చేయాలని, ఇంకా తమను ఎన్నాళ్ల వ్యతిరేక పోస్టులలో పని చేయిస్తారని, తక్షణమే అందరితో సమానంగా తమను బదిలీ చేయాలని కోరుతూ కౌన్సెలింగ్ కేంద్రం వద్ద రాత్రి ఆందోళనకు దిగారు. ప్రభుత్వం భాషా పండితులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసు విషయాన్ని సాకుగా చూపించి అన్యాయం చేస్తున్నారని, ప్రతిసారి తమను డీఈఓ పూల్‌లో ఉన్నారనే కారణంతో అవసరమైనప్పుడల్లా వివిధ ప్రాంతాల్లోని స్కూళ్లకు బదిలీ చేస్తున్నారని, దీనివల్ల తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. న్యాయం చేసేవరకు నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

భక్తిశ్రద్ధలతో సావిత్రి వ్రతం

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీ లలితా పీఠంలో బుధవారం జేష్ఠ మాసం పౌర్ణమి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు జరిగాయి. లలితా అమ్మవారికి పంచామృతాభిషేకం, శ్రీ వట సావిత్రి వ్రతం తదితర పూజలు విశేషంగా నిర్వహించారు. పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి ముత్తైదువులకు ఆశీర్వచనం అందించి సందేశమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



ప్రత్యేక అలంకరణలో లలితా అమ్మవారు



వ్రతంలో పాల్గొన్న మహిళలు